నేడు గణేశ్ నిమజ్జన వేడుకలు

- ఖమ్మంలో శోభాయాత్రను ప్రారంభించనున్న మంత్రి తుమ్మల

ఖమ్మం, సెప్టెంబర్ 15: గణేశ్ నిమజ్జన కార్యక్రమం ఉమ్మడి జిల్లాలో సోమవారం వైభవంగా జరుగనుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు ఇప్పటికే పూర్తి చేశారు. ఖమ్మం కలెక్టర్, కేఎంసీ కమిషనర్ పర్యవేక్షించారు. కాగా, ఖమ్మంలో కొలువైన గణనాథులను ఏయే మార్గాల ద్వారా నిమజ్జనానికి తీసుకెళ్లాలనే రూట్‌మ్యాప్‌ను సీపీ సునీల్‌దత్ ఇప్పటికే ప్రకటించారు. గాంధీచౌక్‌లోని ప్రత్యేక వేదిక నుంచి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం మధ్యాహ్నం 3:30 గంటలకు శోభాయాత్రను ప్రారంభించనున్నారు. శోభాయాత్ర వేదికను కూడా అధికారులు సిద్ధం చేశారు. లైసెన్స్ కలిగిన డ్రైవర్లను మాత్రమే వాహనం నడిపేందుకు అనుమతించనున్నారు. సోమవారం ఉదయం 10 గంటలకే మండపాల నిర్వాహకులు ఊరేగింపు వేడుకులను ప్రారంభించుకోవాలని సూచించారు.

కోడిగుడ్లు పాట్టు తీస్తున్న కార్మికులు

వంట చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

- బిల్లులు, వేతనాలు రాకపోవడంతో కార్మికుల సతమతం
- అప్పు చేసి మధ్యాహ్న భోజనం వండుతున్న మహిళలు
- గుడ్ల ధర కూడా గిట్టుబాటు కావడం లేదంటూ ఆవేదన
- ఆందోళనలు చేసినా పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం
- భద్రాద్రి జిల్లా వ్యాప్తంగా రూ.కోటికి పైగా బకాయిలు

వంటోళ్లకు తంటాలు

పాత కొత్తగూడెం హైస్కూల్‌లో వంట చేస్తున్న ఈమె పేరు ఆవాల శ్రావణి. పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండి పెడుతున్నది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో వేతనంతోపాటు బిల్లులు కూడా సకాలంలో వచ్చేవి. దీంతో జీవనం సాఫీగా సాగిపోయింది. కానీ కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత వేతనాలు, బిల్లులు సక్రమంగా రావడం లేదు. వంట కోసం తెచ్చిన అప్పు పెరిగిపోయింది. దీంతో గత్యంతరం లేక మెడలోని బంగారు పుస్తెల తాడును తాకట్టు పెట్టి అప్పు తీర్చింది. పిల్లలకు మధ్యాహ్న భోజనం వండి పెట్టే తమ కష్టాన్ని గుర్తించని కాంగ్రెస్ ప్రభుత్వంపై దుమ్మెత్తిపోస్తోంది. వేతనాలు, బిల్లులు సకాలంలో ఇవ్వకపోవడంతో కుటుంబాలు ఆగమయ్యే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తోంది. ఇది శ్రావణి ఒక్కరి సమస్య కాదు. భద్రాద్రి జిల్లావ్యాప్తంగా 2,150 ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కార్మికులుగా పనిచేస్తున్న 1,107 మంది కార్మికులది.

కొత్తగూడెం ఎడ్యుకేషన్, సెప్టెంబర్ 15: సర్కారు పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండి పెట్టే కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం నరకం చూపిస్తోంది. రెక్కాడితే గానీ డొక్కాడని కార్మికులకు నెలనెలా వేతనాలు వస్తేనే సరిపోయేది అంతంతమాత్రం. కానీ.. మూడునెలల నుంచి బిల్లులు రాకపోవడంతో వంట కోసం మళ్లీ అప్పు చేస్తున్నారు. తమ పెండింగ్ బిల్లులు చెల్లించాలని కలెక్టరేట్ ఎదుట ధర్నాలు, రాస్తారోకోలు, ఆందోళనలు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనుంచి విద్యార్థులకు గుడ్లు ఇచ్చేది లేదని తెగేసి చెబుతున్నారు. ఒక్క గుడ్డుకు ప్రభుత్వం ఇచ్చేది రూ.5 అయితే.. బయట రూ.7.50 చొప్పున కొనుగోలు చేయాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 'ఆడబిడ్డలపై కొత్త సర్కారు చూపించే ప్రేమ ఇదేనా?' అంటూ వారు వాపోతున్నారు. కాగా, ప్రస్తుతం మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లులు రూ.కోటికి పైగా పెండింగ్‌లో ఉన్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. తాము అధికారంలోకి వస్తే మధ్యాహ్న భోజన కార్మికులకు నెలకు రూ.10 వేల వేతనం ఇస్తామన్న హామీని కాంగ్రెస్ అటకెక్కించిందని, అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలు కూడా పరిష్కరించడం లేదని పలువురు వంట కార్మికులు ఆరోపిస్తున్నారు.

రూ. కోటికి పైగా బకాయిలు

జిల్లాలోని 2,150 ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం కొనసాగుతోంది. అంతేగాక గత కేసీఆర్ ప్రభుత్వం విద్యార్థుల కోసం సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ప్రవేశపెట్టి సమర్థవంతంగా నిర్వహించగా.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం దానిని విస్మరించింది. తాము అప్పు చేసి మధ్యాహ్న భోజనం వండిపెట్టినప్పటికీ వంటలకయ్యే సరుకులకు బిల్లులు కూడా ఇవ్వకపోవడం ఏమిటని పలువురు కార్మికులు ప్రశ్నిస్తున్నారు.

నెలల తరబడి బిల్లులు ఇవ్వకుంటే ఎలా?

పాఠశాలల్లో వంట షెడ్లు లేవు. గ్యాస్ పొయ్యిలు రావు. వేతనాలు, బిల్లులు కూడా సకాలంలో అందకపోవడంతో సతమతమవుతున్నాం. నిత్యావసర సరుకుల ధరలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. నెలల తరబడి పెండింగ్‌లో బిల్లులు ఉంటే కిరాణా షాపు యజమానులు రోజూ డబ్బులు పెడుతున్నారు. కిరాణా దుకాణాల వద్ద అధికారులు అప్పు ఇప్పిస్తే వండి పెట్టడానికి మాకు ఎలాంటి అభ్యంతరం లేదు.

– గుంజి రమాదేవి,
వంట కార్మికురాలు, కొత్తగూడెం

బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి..

మధ్యాహ్న భోజన కార్మికులకు బిల్లులు రావాల్సిన మాట వాస్తవమే. మూడునెలల బిల్లులు చెల్లించాల్సి ఉంది. దీనిపై వర్కర్లు వినతిపత్రాలు ఇచ్చారు. ప్రభుత్వం నుంచి బడ్జెట్ రాగానే బిల్లులు చెల్లిస్తాం. ఇప్పటికే వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం.

– వెంకటేశ్వరాచారి, డీఈవో,
భద్రాద్రి కొత్తగూడెం

ప్రభుత్వమే గుడ్లు సరఫరా చేయాలి

పాఠశాలల్లో పిల్లలకు ఇచ్చే కోడిగుడ్లను ప్రభుత్వమే సరఫరా చేయాలి. బయటి మార్కెట్లో ఒక్క కోడిగుడ్డు ధర రూ.7.50 ఉంటే.. ప్రభుత్వం కేవలం రూ.5 మాత్రమే చెల్లిస్తోంది. దీంతో మాపై అదనపు భారం పడుతున్నది. మేము కొనుగోలు చేసిన వాటికి బిల్లులు ఇవ్వకపోగా.. అదనపు ధరలు కూడా భరించాల్సి వస్తోంది. ఇక నుంచి భోజనంలో గుడ్లు అందించవద్దని అనుకుంటున్నాం. వేతనాలు లేకుండా ఎన్ని రోజులు పని చేయాలి?

– దాట్ల స్వప్న,
వంట కార్మికురాలు,
కొత్తగూడెం

పరిహారం కోసం చూసి..

ప్రాణాలు విడిచి..

- మున్నేటి వరదకు సర్వస్వం కోల్పోయిన 'కోటయ్య' కుటుంబం
- సర్కారు సాయం కోసం వారం రోజులుగా ఎదురుచూపు
- భారం భరించలేక గుండెపోటుతో కన్నుమూత
- భౌతికకాయాన్ని సందర్శించి ఆర్థిక సాయం చేసిన బీఆర్ఎస్ నేతలు

ఇటీవలి మున్నేటి వరదలో మునిగిపోయిన కోటయ్య ఇల్లు (ఫైల్)

దోరేపల్లి కోటయ్య (ఫైల్)

ఖమ్మం వ్యవసాయం, సెప్టెంబర్ 15:ఖమ్మంలో గత నెల 31న ఊహించని విధంగా ఉప్పొంగిన మున్నేరు ప్రవాహం తెల్లారే సరికి వేలాది కుటుంబాలను చెల్లాచెదురు చేసింది. లక్షలాది ఎకరాల పంటను ముంచేసింది. కష్టజీవులకు కట్టుబట్టలు తప్ప మరేమీ మిగలలేదు. ఇళ్లన్నీ నీటమునిగి సమస్తమూ కొట్టుకుపోయింది. ప్రాణాలు అరిచేతిలో పెట్టుకొని బయటకు పేదలందరికీ.. మరుసటి రోజు నుంచే కష్టాలు మొదలయ్యాయి. ఇంట్లో ఉన్న నిత్యావసర సరుకులు, ఇతర వస్తువులు, ఇంటి సామగ్రి, వంట సామగ్రి వరదపాలయ్యాయి. కొందరి ఇళ్లు కొట్టుకుపోయాయి. ఇంకొంది ఇళ్లు కూలిపోయాయి. అప్పటి నుంచి వరద బాధిత కుటుంబాలు.. ముఖ్యంగా పేదల పరిస్థితి దినదినగండం నూరేళ్ల ఆయుష్సులా మారింది. కానీ అలాంటి వారిని ఆపదలో ఆదుకోవాల్సిన ప్రభుత్వాలు.. కనీస భరోసా కూడా ఇవ్వలేదు. ఇలా సర్కారు సాయం కోసం ఎదురుచూసిన వారిలో చాలా మంది ఆర్థిక పరిస్థితి దయనీయంగా ఉంది. రోజులు గడుస్తున్నా సర్కారు సాయం అందకపోవడం, ఇకనైనా భరోసా లభిస్తుందన్న నమ్మకం నశించిపోవడం వంటి కారణాలతో కొందరు పేదలు గుండె చెదురుతున్నారు. ఇలాంటి వారిలో కుటుంబ యజమాని అయిన ఓ వృద్ధుడు ఉన్నాడు. మున్నేరు మిగిల్చిన భారాన్ని భరించలేని అతడు.. ఆర్థిక ఒత్తిడిని తాళలేక గుండెపోటుతో ప్రాణాలు విడిచాడు. ఈ ఘటన ఆదివారం చోటుచేసుకుంది.

సాయం కోసం చూసీచూసీ..

కూలిన కోటయ్య నివాసపు గోడ

కోటయ్య (70) దశాబ్దాలుగా దానవాయిగూడెం పార్కు ఏరియాలోని గణేశ్‌నగర్‌లో ఓ రేకుల ఇంట్లో నివసిస్తున్నాడు. గతంలో డ్రైవర్‌గా పనిచేసిన ఆయన.. వృద్ధాప్యం కారణంగా కొన్నేళ్లుగా ఇంటి వద్దనే ఉంటున్నాడు. అతడికి ఇద్దరు కుమారులు ఉండగా అంతకుమునుపే కుమారుడు మరణించాడు. కుమార్తెకు వివాహం ఆమె కూడా అత్తారింటికి వెళ్లిపోయింది. అవివాహితుడైన ఈ కుమారుడు కూడా తల్లిదండ్రులతో ఉండడం లేదు. భార్య శాంతమ్మతో కలిసి కోటయ్య ఆ రేకుల ఇంట్లో నివసిస్తున్నాడు. తనకు వచ్చే రూ.2 వేల ప్రభుత్వ ఆసరా పింఛన్‌తోనే జీవనాన్ని వెళ్లదీస్తున్నాడు. ఈ క్రమంలో గత నెల 31న వచ్చిన మున్నేటి భారీ వరద వీరి ఇంటిని ముంచెత్తింది. కోటయ్య, అతటి భార్య శాంతమ్మ కలికి ఆ రాత్రి కట్టుబట్టలతో బయటికెళ్లాడు. కొద్దిరోజులపాటు తెలిసిన వారి ఇంట్లో తలదాచుకున్నారు. వరద తగ్గాక ఇంటికి రావడంతో ఇంటి గోడలన్నీ పగుళ్లతో కన్పించాయి. బాత్‌రూం కూలిపోయింది. అతడి మోపెడ్ వాహనం బురదలో కూరుకుపోయింది. నిత్యావసర సరుకులు సహా ఇంట్లోని వస్తువులన్నీ వరదలో కొట్టుకుపోయాయి. వీరు వృద్ధాప్యంలో ఉన్నందున బంధువులు వచ్చి ఇంట్లోని బురదను శుభ్రం చేసి వెళ్లారు. ఈ క్రమంలో సర్వస్వం కోల్పోయి తీవ్రమైన ఒత్తడికి గురైన కోటయ్య.. ఐదు రోజులుగా మనోవేదనతో ఉంటున్నాడు. గుండె సంబంధిత వ్యాధికి గురైనట్లు తెలిసింది. దీంతో ఖమ్మంలోని ఓ వైద్యశాలకు తరలించగా మూడురోజులపాటు చికిత్స పొందినట్లు సమాచారం. శనివారం డిశ్చార్జ్ అయి ఇంటికి చేరుకున్నప్పటికీ ఇంటి పరిస్థితిపై ఆదే ఆందోళన చెందాడు. ఈ క్రమంలో తీవ్రమైన గుండెపోటు రావడంతో కోటయ్య ఆదివారం మధ్యాహ్నం ప్రాణాలు వదిలాడని స్థానికులు, కటుంబ సభ్యులు తెలిపారు.

ప్రభుత్వ నిర్లక్ష్యమే ప్రాణం తీసిందంటున్న బీఆర్ఎస్ నేతలు..

కోటయ్య మృతికి ప్రభుత్వమే కారణమని బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, స్థానిక మాజీ కార్పొరేటర్, ప్రస్తుత కార్పొరేటర్ భర్త తోట రామారావు ఆరోపించారు. కోటయ్య మరణవార్త తెలుసుకున్న వెంటనే నాగరాజు, రామారావు కలిసి హుటాహుటిన మృతుడి ఇంటికి చేరుకున్నారు. కోటయ్య భౌతికకాయానికి నివాళులర్పించారు. దహన సంస్కారాల నిమిత్తం తమవంతుగా తక్షణ ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం వరదలో మునిగిన కోటయ్యను పరిశీలించారు. వరదలు తగ్గి దాదాపు పక్షం రోజులు కావస్తున్నా ఏ ఒక్క అధికారీ గణేశ్‌నగర్‌లో పర్యటించలేదని అన్నారు. సర్వేలు చేసి ఆర్థిక సహాయం చేశామని చెబుతున్న ప్రభుత్వ పెద్దలు గణేశ్‌నగర్‌కు వచ్చి వాస్తవ పరిస్థితిని తెలుసుకోవాలని డిమాండ్ చేశారు.

కనిగిరి గుట్టలపైకి నడిచి వెళ్తున్న భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్

కనిగిరి వీరభద్రుడి సన్నిధిలో కలెక్టర్

- చండ్రుగొండలో కాకతీయుల కట్టడాల పరిశీలన
- 8 కిలోమీటర్లు కాలినడకన వెళ్లిన జిల్లా పాలనాధికారి

చండ్రుగొండ, సెప్టెంబర్ 15: మండల పరిధి బెండాలపాడు గ్రామ శివారులోని కనిగిరి (కనకాద్రి) గుట్టలను కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదివారం సందర్శించారు. ఉదయం 7 గంటలకు బెండాలపాడు ఆదివాసీ గిరిజనులతో కలిసి అడవిలోకి కాలినడక వెళ్లి ప్రకృతి అందాలను ఆశ్వాదించారు. గుట్టలపై కాకతీయుల కాలంలో కట్టిన వీరభద్రుడి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి కట్టడాలను పరిశీలించారు. తన వెంట జిల్లా, ఇతర అధికారులెవ్వరినీ తీసుకెళ్లలేదు. బెండాలపాడులో వెదురుతో తయారుచేసే బ్యాంబో క్లస్టర్‌ను సందర్శించారు. కలెక్టర్‌ను ఎంపీడీవో అశోక్, ఎస్సై స్వప్న, సీనియర్ నాయకులు మాలోత్ భోజ్యానాయక్ గ్రామంలో కలిశారు. ప్రకృతి అందాలు బాగున్నాయని కలెక్టర్ స్థానికులకు తెలిపారు.

భద్రాద్రి రామాలయం పేరుతో విరాళాల సేకరణ

సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న భద్రాద్రి ఆలయ కార్యనిర్వహణ అధికారి రమాదేవి

- యూఎస్ఏ ఆలయ నిర్వాహకుల నిర్వాకం
- రాష్ట్ర దేవాదాయ కమిషనర్‌కు ఫిర్యాదు
- వివరాలు వెల్లడించిన భద్రాద్రి ఆలయ ఈవో రమాదేవి

బూర్గంపహాడ్(భద్రాచలం), సెప్టెంబర్ 15 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం పేరుతో యూఎస్ఏకు చెందిన ఆలయ నిర్వాహకులు విరాళాలు సేకరిస్తున్నట్లు గుర్తించామని దేవస్థానం కార్యనిర్వహణాధికారి(ఈవో) రమాదేవి తెలిపారు. ఆదివారం ఆలయంలోని చిత్రకూట మండపంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆ వివరాలను ఆమె వివరించారు. భద్రాద్రి శ్రీరామ టెంపుల్ ఆఫ్ యూఎస్ఏ పేరుతో ఆలయానికి విరాళాలు సేకరిస్తున్నారని తమ దృష్టికి వచ్చిందని, శ్రీరామ టెంపుల్ పేరుతో కోట్లాది రూపాయలు యూఎస్ఏ ఆలయ నిర్వాహకులు వసూలు చేశారన్నారు. ఖగోళ యాత్రలో భద్రాద్రి శ్రీరామ టెంపుల్ ఆఫ్ యూఎస్ఏ పేరుతో భద్రాచలంలోని ఆర్యవైశ్య సత్రంలో సీతారాముల కల్యాణం చేసేందుకు యూఎస్ఏ అర్చకులు సిద్ధం చేసుకున్నారని తెలిపారు. భద్రాద్రి పేరుతో ఎవరైనా విరాళాలు సేకరించినా, భద్రాద్రి ఆలయ పేరును వాడినా వారిపై దేవాదాయశాఖ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. భద్రాద్రి శ్రీరామ టెంపుల్ ఆఫ్ యూఎస్ఏ పేరుతో లెటర్‌ప్యాడ్‌ను టైప్ చేయించి ఖగోళయాత్ర కోసమని ఈ విరాళాల సేకరణకు యూఎస్ఏ ఆలయ అర్చకులు పాల్పడుతున్నారని ఈవో వెల్లడించారు. విరాళాలు సేకరిస్తున్న విషయాన్ని రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఆలయ ఏఈవో భవానీ రామకృష్ణ, ఆలయ ఈఈ రవీందర్ రాజు, ఆలయ అర్చకులు రామస్వరూప్, అమరవాది విజయరాఘవన్, గోపి, కిరణ్‌కుమార్, ఆలయ సూపరింటెండెంట్ సాయిబాబా పాల్గొన్నారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను

వెంటనే నెరవేర్చాలి

- తెలంగాణ ఉద్యమకారుల ఫోరం డిమాండ్
- ఖమ్మం చేరుకున్న చైతన్యయాత్ర

పోస్టర్లు ఆవిష్కరిస్తూ నినాదాలు చేస్తున్న ఉద్యమకారుల ఫోరం బాధ్యులు

ఖమ్మం, సెప్టెంబర్ 15: ఎన్నికల సమయంలో తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం బాధ్యులు డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వారికి ఇచ్చిన హామీలను అమలుచేయాలన్న డిమాండ్‌తో 33 జిల్లాల చైతన్యయాత్రలో భాగంగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం బాధ్యులు చేపట్టిన యాత్ర ఆదివారం ఖమ్మానికి చేరుకుంది. ఫోరం ఖమ్మం జిల్లా చైర్మన్ కేవీ కృష్ణారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్ ఉద్యమంలో పాల్గొన్న ప్రతి ఉద్యమకారుడికీ 250 చదరపు గజాల స్థలం, రూ.25 వేల పింఛన్, ఉద్యమకారుల గుర్తింపు కార్డులు, ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు, రూ.పది వేల కోట్ల బడ్జెట్ కేటాయింపు వంటి హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ హామీలను మేనిఫెస్టోలో కూడా పెట్టిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చి ఇన్ని నెలలైనా వాటిని అమలుచేయడం లేదని విమర్శించారు. ఈ హామీలను నెరవేర్చకుంటే మరో పోరాటం తప్పదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తొలుత ఖమ్మం మయూరిసెంటర్‌లో అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. ఫోరం బాధ్యులు అర్వపల్లి విద్యాసాగర్, నాంచారయ్య, పగడాల నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి గణపతి నిమజ్జనంలో..

ఐటీడీఏ పీవో దంపతులు

మట్టి గణపతి ప్రతిమను నిమజ్జనానికి తీసుకెళ్తున్న పీవో

బూర్గంపహాడ్ (భద్రాచలం), సెప్టెంబర్ 15: మట్టి వినాయకుడిని తమ ఇంట్లో ప్రతిష్ఠించి భక్తిశ్రద్ధలతో పూజించిన ఐటీడీఏ పీవో రాహుల్, మనీషా దంపతులు.. ఆ గణనాథుడి విగ్రహాన్ని ఆదివారం గోదావరిలో నిమజ్జనం చేశారు. ఏఎస్పీ అంకిత్‌కుమార్, ఇతర అధికారులతో కలిసి పీవో.. సతీసమేతంగా మట్టి వినాయకుడిని తీసుకువచ్చి గోదావరి వద్ద పూజలు చేశారు. అనంతరం నిమజ్జనం చేశారు.

ప్రపంచ న్యాయ దినోత్సవ శుభాకాంక్షలు
వందమంది దోషులు తప్పించుకున్న పర్వాలేదు కాని ఒక్క అమాయకుడికే కూడా అన్యాయం జరగొద్దు...
న్యాయవాదులందరికీ ప్రపంచ న్యాయ దినోత్సవ శుభాకాంక్షలు
గాజుల అమర్‌నాథ్
అడ్వకేట్, LL.B., LL.M.,
ఇ.నెం. 5-5-189/6, ముస్తఫానగర్, బొమ్మ జగ్గయ్య మిల్ దగ్గర, ఖమ్మం.
Cell : 8019503266, 8885491372

ప్రపంచ న్యాయ దినోత్సవ శుభాకాంక్షలు
న్యాయమూర్తులకు, న్యాయవాదులకు, కక్షిదారులకు ప్రపంచ న్యాయ దినోత్సవ శుభాకాంక్షలు...
బత్తుల బసవ పృథ్వయ్య
MCM., LL.B.
న్యాయవాది
ఖమ్మం జిల్లా న్యాయస్థానం

ప్రపంచ న్యాయ దినోత్సవ శుభాకాంక్షలు
వందమంది దోషులు తప్పించుకున్న పర్వాలేదు కాని ఒక్క అమాయకుడికే కూడా అన్యాయం జరగొద్దు...
న్యాయవాదులందరికీ ప్రపంచ న్యాయ దినోత్సవ శుభాకాంక్షలు
ఓరుగంటి శేషగిరి రావు
M.A., B.L.
అడ్వకేట్
ఓరుగంటి నగర్, HP పెట్రోల్ బంక్ ఎదురుగా, వరంగల్ X రోడ్, ఖమ్మం జిల్లా.
Cell : 9849505610

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616